
స్టేజీపై స్టెప్పులు వేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్


కళాకారుల ఆటపాటలు

బీఆర్‌ఎస్ కార్యకర్తల్లో జోష్ నింపిన మంత్రి

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బుధవారం గులాబీ దళం జోరు అంబరాన్ని అంటింది. ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు తండోపతండాలుగా వచ్చిన వివిధ గ్రామాల ప్రజలు, కార్యకర్తలు, నాయకుల్లో మంత్రి శ్రీనివాస్ గౌడ్ మరింత జోష్ నింపారు. ఓ వైపు ప్రముఖ గాయని మధుప్రియ పాటలు పాడుతుండగా మంత్రి అందుకు అనుగుణంగా స్టెప్పులు వేశారు. దీంతో ఒక్కసారిగా సభా ప్రాంగణం హోరెత్తింది.


మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్లకార్డులతో ..

పత్తి పంటల పరిశీలన



రాజాపూర్: పత్తిలో గులాబి రంగు పురుగు ఉధృతికి రైతులు నివారణ చర్యలు తీసుకోవాలని ఏరువాక కోఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ భరత్‌భూషన్ అన్నారు. బుధవారం మల్లేపల్లిలో రైతులు సాగుచేసిన పత్తిపంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యంగా పత్తి పంట సస్యరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో చెన్నారెడ్డి, శ్రీశైలం, రాములు, కృష్ణయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

పథకాలన్నీ బీఆర్‌ఎస్ వారికేనా?


మిథున్‌రెడ్డి దంపతులకు గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'బీసీ బంధు, దళిత బంధు, డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇలా అన్ని పథకాలు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకేనా?' అని బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం స్థానిక 15వ వార్డు పరిధిలోని శివాజీనగర్, నీల్యానాయక్‌తండా, లచ్చిరాం తండా, పూజారితండా, తిర్మల్‌కుచ్చతండా తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీరోడ్లు, వీధి లైట్లు, డ్రెయినేజీలు, ఇంటింటికీ తాగునీరు, మరుగుదొడ్లు కట్టించింది కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వమని పేర్కొన్నారు. గర్భిణులకు ఇంద్రధనుస్సు పథకం కింద పోషకాహారం అందిస్తున్నామన్నారు. రైతులను గుండెల్లో పెట్టుకుని కాపాడుతోందన్నారు. గ్రూప్–1, 2, 3, 4 నోటిఫికేషన్ల పేరిట నిరుద్యోగుల నుంచి దరఖాస్తు ఫారాలకు రూ.వందల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దండుకుందని ఆరోపించారు. ఉద్యోగాలు వస్తాయని పరీక్షలు రాస్తే.. ఆ పేపర్లు కూడా లీక్ చేయించి వారి జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. పదేళ్లయినా పేదలకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం లేదన్నారు. ఆయా కార్యక్రమాల్లో మిథున్‌రెడ్డి సతీమణి రిషికారెడ్డి, బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అక్బర్‌పాషా, జిల్లా అధ్యక్షుడు ఫరూక్, పార్టీ నాయకులు జి.పద్మజారెడ్డి, జయశ్రీ, వేనమ్మ, పాండురంగారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, నారాయణ యాదవ్, గద్ద బుచ్చన్న, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్ రెడ్డిని గెలిపించాలంటూ బుధవారం సాయంత్రం పట్టణంలోని వీరన్నపేట, మదీనా మసీదు, షాషాబ్‌గుట్ట తదితర ప్రాంతాల్లో మైనారిటీ మోర్చా ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అక్బర్‌పాషా, జిల్లా అధ్యక్షుడు ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.


హాజరైన గిరిజనం


లంబాడా వేషధారణలో బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి సతీమణి రిషికారెడ్డి

క్లుప్తంగా

యాజ్ఞవల్క జయంతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా యాజ్ఞవల్క జయంతిని కళాశాల సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, నరసింహరావు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలో హామీలన్నీ నెరవేర్చాం

జడ్చర్ల: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలలో తామిచ్చిన హామీలన్నీ నెరవేర్చామని.. బీఆర్‌ఎస్ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆ రాష్ట్ర వైద్యశాఖ మంత్రి శరణ్‌ప్రకాశ్ పాటిల్ తెలిపారు. బుధవారం పాండిచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామితో కలిసి కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా జడ్చర్లలో ప్రచారం నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణాలో కూడా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు.

నిబంధనలు వర్తించవా?

బాలానగర్: పెద్దరేవల్లిలో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల నిబంధనలు పాటించలేదని కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు ఆదిరమణా రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పర్యటన సందర్భంగా గ్రామంలో జెండాలు ఏర్పాటు చేశారని.. అధికారులకు చెబితే తప్పించుకునే ధోరణితో వ్యవహరించారని అన్నారు. ఘటనపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

కొనసాగుతున్న ప్రచారం

→ బీఆర్‌ఎస్ బెదిరింపులకు భయపడొద్దని కాంగ్రెస్ అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల, గుడిబండ, కందూర్, పొన్నకల్, దుబ్బపల్లి, రాచాల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అడ్డాకుల సర్పంచ్ మంజుల, చిన్న చింతకుంటలో బీడీఫ్యాక్టరీల యాజమానులు కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, టీపీసీసీ నేత హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీహరి తదితరులు ఉన్నారు.

→ జిల్లా కేంద్రంలోని 38వ వార్డు న్యూప్రేమ్‌నగర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఇంటింటి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ గెలిస్తే గ్యారంటీ పథకాలను అమలుచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, అజీమ్, అహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

మద్దూరు: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల చదువుతున్న విద్యార్థి అదృశ్యమైనట్లు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్ల సాయిలు మద్దూరులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొడుకు శివప్రసాద్ తొమ్మిదోతరగతి చదువుతున్నాడు. మంగళవారం యథావిధిగా పాఠశాలకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో బంధువులు, కుటుంబ సభ్యుల వద్ద వాకాబు చేశారు. అచూకీ తెలియకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు భగవాన్ సత్యసాయి బాబా జయంతి

నారాయణపేట రూరల్ : భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జయంతిని పట్టణంలోని గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చిట్టెం మాధవరెడ్డి, మల్లికార్జున్, గోపీనాథ్, శివరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 5గంటలకు ఆలయంలో ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, 8గంటలకు ప్రశాంతి పతాకావిష్కరణ, 10గంటలకు సామూహిక సత్యసాయి వ్రతాలు, 11గంటలకు రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు. అధికసంఖ్యలో హాజరుకావాలన్నారు.

ఝల్కారీ బాయికి నివాళి

వనపర్తి టౌన్: బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించేందుకు ఝాన్సీ లక్ష్మీబాయి రాజ్యంలో మహిళా సైన్యాధ్యక్షురాలిగా సేవలందించిన పోరాట యోధురాలు ఝల్కారీ బాయి అని ప్రజా వాగ్గేయకారుడు రాజారామ్ ప్రకాశ్ అన్నారు. ఝల్కారీ బాయి జయంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోలింగ్‌పై అవగాహన అవసరం

జడ్చర్ల: పోలింగ్ ప్రక్రియకు సంబంధించి సమగ్ర అవగాహన కలిగి ఉండి.. అప్రమత్తతతో వ్యవహరించాలని కలెక్టర్ రవినాయక్ అధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక బీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్ర నియోజకవర్గాలకు సంబంధించిన పీఓ, ఏపీఓ, ఓపీఓలకు ఏర్పాటు చేసిన రెండవ విడత శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి సంబంధించి రెండు గదులను ఏర్పాటు చేయాలని స్థానిక ఆర్‌ఓను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఓ మోహన్‌రావు, ఏఆర్‌ఓ శ్రీనువాసులు, ఎంఈఓ మంజులాదేవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

ఓటుహక్కుపై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఎలక్షన్ వాచ్, ఎలక్ట్రోల్ క్లబ్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని, దాన్ని సరిగ్గా ప్రతి ఒక్కరు వినియోగించుకుని ఎన్నికల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ అధికారులు నాగేంద్రస్వామి, బాలయ్య, రమేష్‌చంద్ర, చంద్రకళ, వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



ఏటా జాబ్ క్యాలెండర్


కారు గుర్తుకు ఓటేయ్యాలని చెబుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట/నారాయణపేట రూరల్/మరికల్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని... బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ధన్వాడ మండలం కిష్టాపూర్‌లో ప్రచారం చేశారు. తనను మరోసారి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తమ ప్రభుత్వం అమలు చేయనున్న మరిన్ని పథకాలపై వివరించారు. ఏటా ప్రణాళికా బద్ధంగా జాబ్ క్యాలెండర్ అమలు ఉంటుందన్నారు.

ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు

బీజేపీ, కాంగ్రెస్‌ల మాయమాటలను ప్రజల నమ్మొద్దని ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి ఓటర్లను కోరారు. జిల్లా కేంద్రంలోని 11వ వార్డులో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే కుమార్తె నందికా రెడ్డి సైతం వార్డుల్లో కార్యకర్తలు, నాయకులతో కలసి ప్రచారంలో పాల్గొన్నారు. తన తండ్రిని గెలిపించాలని కోరారు. నమూనా ఈవీయంతో ప్రజల్లోకి వెళ్లారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలు తప్పవని...24 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తున్న కేసీఆర్‌ను గెలిపించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, కౌన్సిలర్ బండి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

నారాయణపేట పట్టణంలోని ట్రాలీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పలువురు డ్రైవర్లు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. మండలంలోని కొల్లంపల్లి యాదవ సంఘం నాయకులు, అభంగపూర్ కాంగ్రెస్ నాయకులు, శేర్నపల్లి బీజేపీ నాయకులు, ఎక్లాస్‌పూర్, తిలేరు నాయకులు పలువురు బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వేపూరి రాములు పాల్గొన్నారు.

మరికల్ మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్. రాజేందర్‌రెడ్డి తరుపున గెలుపునకు ఇంటింటి ప్రచారం చేశారు. నాయకులు తిరుపతయ్య, రామస్వామి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాములు, రాజేష్ పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్‌లో చేరిన ఆటో డ్రైవర్లు

పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి

నారాయణపేట రూరల్ : విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులతోపాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు. ఓపీఓగా వారికి ఎన్నికల విధులు కేటాయించారని, పోలింగ్‌రోజు ఓటువేసుకునే అవకాశం లేకపోవడంతో తమ ఓటుహక్కును కోల్పోవాల్సి వస్తుందని వాపోయారు. మిగిలిన రెండురోజుల్లో ఎన్నికల విధుల్లో ఉండే అన్నిరకాల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసుకునే సౌకర్యం కల్పించే విధంగా రిటరింగ్ అధికారి, కలెక్టర్ చర్యలు చేపట్టాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో మాలధారణ

ఊట్కూర్: మండలంలోని ఈశ్వర్ మందిర్‌లో బుధవారం అయ్యప్పస్వామి మాలధారణ భక్తిశ్రద్ధలతో రఘువీర్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్పమాలవేసుకొని దీక్షను స్వీకరించారు. రఘుగురుస్వామి అయ్యప్ప దీక్ష నియమాలను వారికి సూచించారు. కార్యక్రమంలో గురుస్వాములు చంద్రకంటి శ్రీనివాస్, రాముగౌడ్, రాహుల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా పాలన


ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

బాలానగర్: ప్రజల అవసరాలను ముందే గుర్తించి ఎన్నో పథకాలను తీసుకువచ్చిన కేసీఆర్ కాకుండా మరొకరు వస్తే తిరిగి సమస్యలు వస్తాయని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం గౌతాపూర్, బోడజానంపేట్, హేమాజీపూర్, పెద్ద రేవల్లి, మొదంపల్లి తదితర గ్రామాల పరిధిలో ప్రచారం నిర్వహించారు. తెలంగాణలో దేశానికే ఆదర్శంగా పాలన సాగిస్తున్నట్లు వివరించారు. 55 సంవత్సరాలు అధికారంలో ఉండి ఏమీ చేయని వారు ఇప్పుడు అన్నీ చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అలాంటి వారి మాటలు ప్రజలు నమ్మి మోసపోవద్దని అన్నారు. జీసీసీ చైర్మన్ వాల్యానాయక్, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రావు, బాలునాయక్, ప్రకాష్ పాల్గొన్నారు.

అన్నివిధాల అభివృద్ధి చేసుకుందాం


పార్టీలో చేరిన వారితో అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్/బాలానగర్ : హస్తం గుర్తుకు ఓటేసి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకుందామని కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి అన్నారు. బుధవారం కుచ్చర్‌కల్‌లో ఆయన సమక్షంలో పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే నియోజకవర్గాన్ని సమస్యల పాలు చేశారని, కబ్జాలకు పాల్పడుతున్నారని అన్నారు. కృష్ణయ్య, గోవర్ధన్‌రెడ్డి, రమేష్, రాము, నరహరి, సత్యం శ్రీనివాస్ పాల్గొన్నారు. అనిరుధ్ రెడ్డి తరపున ఆయన తల్లి, రంగారెడ్డి గూడ సర్పంచ్ శశికళ చిన్నరేవల్లిలో ప్రచారం చేశారు. స్థానికుడు ఎమ్మెల్యే అయితే నిత్యం అందుబాటులో ఉంటాడని గుర్తు చేశారు. మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఆదిరమణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం


మాట్లాడుతున్న ఆలవెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర రూరల్/భూత్పూర్/చిన్నచింతకుంట : ప్రజలు, అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకుంటున్నారని, అది బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం కొత్తకోట మండలంలోని వెంకటగిరి, వెంకంపల్లి, రేకులంపల్లి, పేరూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలిచిందన్నారు. పేరూర్ లిఫ్ట్ పనులు పూర్తయితే కొత్తకోట, దేవరకద్ర, చిన్నచింతకుంటలకు సాగునీరు సమృద్ధిగా అందుతుందన్నారు. వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కాటం ప్రదీప్ కుమార్ గౌడ్, సర్పంచ్‌లు పాల్గొన్నారు. కర్నెనలో ఎమ్మెల్యే ఆల సతీమణి మంజుల ప్రచారం నిర్వహించారు. విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వరెడ్డి చిన్నచింతకుంట మండలంలోని అప్పంపల్లి, ముచ్చింతల, దాసర్‌పల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

రోడ్డు ఇలా.. ప్రయాణించేదెలా?



మాగనూర్: మండలంలోని వడ్వాట్ – అడవిసత్యారం గ్రామాలకు వెళ్లేరోడ్డు గుంతలమయంగా మారడంతోపాటు కంపచెట్లతో అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు పెరిగిపోయి రోడ్డును పూర్తిగా కమ్మేశాయి. దీంతో ఎదురుగా వచ్చేవాహనాలు అతి సమీపంలోకి వచ్చేవరకు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అమ్మపల్లి గేట్ నుంచి కోల్పూర్ వరకు కంపచెట్లు కుమ్మేయడంతో రోడ్డు మూలమలుపుల వద్ద వాహనదారులు ఎదురెదురుగా వచ్చినప్పుడు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డుకు ఇరువైపుల పెరిగిన కంపచెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.